క్లుప్తంగా

మంత్రి వేణుకు కృతజ్ఞతలు



మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలుపుతున్న రజక సంఘం నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో అసంపూర్తిగా ఉన్న రజక సంఘ భవనం అభివృద్ధికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించడంపై రామచంద్రపురం నియోజకవర్గ రజక సంఘం నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను కలసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రికి దుశ్శాలువా కప్పి పూల బొకేలను అందించి తమ సంతోషాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి వెంకటరమణ తదితర నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పనుల పరిశీలన



వడ్లమూరులో రజక కమ్యూనిటీ భవనం శ్లాబ్ పనులు పర్యవేక్షిస్తున్న జేఈ రాఘవులు

కపిలేశ్వరపురం: వడ్లమూరులో రజక కమ్యూనిటీ భవనం పనులను పంచాయతీ రాజ్ జేఈ డీవీవీ రాఘవులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీపీ, ఎమ్మెల్సీ కోటా నిధులు రూ.15 లక్షలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం శ్లాబ్ పనులు చేపట్టామన్నారు. ఈ గ్రామంలో ఎమ్మెల్సీ కోటా నిధులు మరో రూ.15 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్టు జేఈ వివరించారు.

పడమర ఖండ్రికలో ఫ్యామిలీ డాక్టర్

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పడమర ఖండ్రికలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కపిలేశ్వరపురం సీహెచ్‌సీ వైద్యాధికారి బి.అనంత రామకృష్ణ రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి రాలేని రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేశారు. ఎంపీహెచ్‌ఈఓ జుత్తుక మల్లికార్జునరావు, హెచ్‌వీ టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఎంపీహెచ్‌ఏ వెన్నేటి వెంకటేశ్వర్లు, సచివాలయ ఏఎన్‌ఎం చెల్లుబోయిన బేబీ, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

కపిలేశ్వరపురం: బ్యాంకు ఖాతాలకు సంబంధించి జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ఖాతాదారులంతా అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ కపిలేశ్వరపురం బ్రాంచ్ మేనేజర్ చంటికుమార్ సూచించారు. కపిలేశ్వరపురం సచివాలయంలో సోమవారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు ప్రతినిధులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులెవరూ ఖాతాదారులకు సంబంధించిన సమాచారాన్ని ఫోన్ ద్వారా అడగరని గుర్తించాలన్నారు. చట్ట పరిధిలోనే బ్యాంకు లావాదేవీలన్నీ జరుగుతాయని, ఫోన్ చేసి వ్యక్తిగత, ఖాతాకు సంబంధించిన వివరాలను అడిగితే వెల్లడించేందుకు ఖాతాదారులు నిరాకరించాలని సూచించారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్, కార్యదర్శి కె.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఏడు అర్జీలు

రామచంద్రపురం: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 7 అర్జీలు వచ్చినట్లు కార్యాలయం అధికారులు తెలిపారు. పాస్ పుస్తకం మంజూరు చేయాలని ఒకటి, ఆక్రమణ తొలగించాలని రెండు, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపు కోరుతూ ఒకటి, రీసర్వేలో భూమి తక్కువగా చూపించుట సరి చేయాలని ఒకటి, రామచంద్రపురం మున్సిపాలిటీ అధికారులు ప్లాన్ అప్రూవల్ చేయుటంలో ప్రభుత్వానికి నష్టం వచ్చే విధంగా చేస్తున్నారని ఒకటి అర్జీలు వచ్చాయి. దీనిపై విచారణ నిమిత్తం మరో దరఖాస్తు అందినట్లు తెలిపారు. ఆర్డీవో పి.సింధు సుబ్రహ్మణ్యం స్పందన అర్జీలను స్వీకరించారు.

బైక్ చోరీ

రామచంద్రపురం రూరల్: బాపట్ల జిల్లా రేపల్లె మండలం లంకెవానిదిబ్బకు చెందిన లంకె నాగరాజు బైక్ రామచంద్రపురం మండలం భీమేశ్వరస్వామి ఆలయం వద్ద చోరీకి గురైంది. ఎస్సై పి.వినోద్ కథనం ప్రకారం... బాధితుడు నాగరాజు తన బావతో కలసి ఈ నెల 3న సాయంత్రం ఆలయం వద్దకు చేరుకున్నాడు. ఆలయం ఆవరణలో బైక్ పార్క్ చేయగా తిరిగి వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు.

వ్యక్తికి గాయాలు

మండపేట: స్థానిక గొల్లపుంతలో మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న వ్యక్తిని మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో గాయాలయ్యాయి. ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం.. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం జరిగిన ఘటనలో బాధితుడు గేదెల రమణకు తీవ్ర గాయాలయ్యాయి.

గురుతరం... నిరంతరం

- బోధనలో గురువుల స్థానం పదిలం
- నేడు ఉపాధ్యాయుల దినోత్సవం



మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాఠం చెబుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం: ఇసుకలో అక్షరాలు దిద్దించిన కాలం నుంచి ఇంటర్నెట్‌లో పాఠాలు నేర్చుకునే తరం వచ్చినా గురువు స్థానం పదిలం.. చేతిలో సనాతన చాక్ పీస్‌లు పోయి ప్రస్తుతం డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు వచ్చినా ఉపాధ్యాయుల సేవ మహోన్నతం .. మారుతున్న కాలానికి అనుగుణంగా గురువులు తనను తాను మార్చుకుంటూ విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తూ వారు సాగుతున్న పయనం ఎందరికో ఆదర్శం. మనిషికి ఊపిరినూదేది అమ్మనాన్నలే అయినా ఉన్నతమైన మనిషిగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడే. అందుకే మాతృ, పితృ, గురు దేవోభవ అని పెద్దలన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ సామాజిక బాధ్యతను చెప్పడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిది. కాలం మారినా ఉపాధ్యాయుని పాత్ర యథావిధిగా కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి విశేష కృషి చేస్తుంది. ప్రభుత్వం నాడు–నేడు పథకంలో పాఠశాలలను రూ.కోట్లతో అభివృద్ధి చేస్తోంది. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు మధ్యాహ్న భోజన పథకంలో మెనూను మెరుగుపర్చింది. ఈ పాఠశాలల్లో విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. వారి సేవ ఎనలేనిది. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం ఇది.

మా నాన్నే నాకు గురువు



నాకు మా నాన్న టి.నాగభూషణరావు గురువు. ఆయన వద్దే చదువుకున్నాను. విజయనగరం జిల్లా చల్లపేటలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆయన హెచ్‌ఎంగా పనిచేశారు. ఇంగ్లిష్ బోధించే రోజుల్లో చెప్పిన పోయమ్‌ని అదేరోజు చదివి చూడకుండా రాసి అప్పగించాలని నియమం పెట్టేవారు. అలా చేసినవారిలో నాతో సహా సుమారు 70 మంది వివిధ రంగాల్లో ఉన్నత స్థితికి చేరారు. నాన్నను చూసి ఇంగ్లిష్ భాషపై ఆసక్తి పెంచుకున్నా. ఆయన కఠోర దీక్షా ఫలితంగా నేను ఇంగ్లిష్‌లో పీహెచ్‌డీ సాధించాను. నెట్ పరీక్ష ఉత్తీర్ణుడయ్యాను. లిటరేచర్ ఆప్షన్‌తో సివిల్స్ రాసి సెలక్ట్ అయ్యా.

–టీకేవీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండపేట

ప్రభుత్వ పాఠశాలలోనే చదివించా..



నేను కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలోనూ, నా భార్య ఎం.భాగ్యలక్ష్మి వాకతిప్ప జెడ్పీ హైస్కూల్‌లోనూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నాం. మా విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే సాగింది. అదే వారసత్వంతో మా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని నిర్ణయించుకున్నాం. ఇందులో భాగంగా మా పిల్లలిద్దరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాం. పెద్దమ్మాయి ప్రేమసుగంధినీ కాలేరు ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వరకూ చదివి మంచి ప్రతిభ కనబర్చింది.

–పి.సురేంద్రకుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కాలేరు

అన్ని విధాలా ప్రోత్సహించారు



టేకి ఎలిమెంటరీ స్కూల్‌లో ఒకటో తరగతిలో చేరినప్పుడు ఉపాధ్యాయుడు రవనాతి ఉదయ భాస్కరావు నాకు అక్షరాలు దిద్దించారు. నన్ను అన్ని విధాలా ప్రోత్సహించారు. నాకు 1986లో ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చాక ఆయన పనిచేస్తున్న కె.గంగవరం మండలం నీలగిరిపేట ప్రభుత్వ పాఠశాలలో నేనూ ఉపాధ్యాయ బాధ్యతలను చేపట్టాను. మా మాస్టారు ఉన్నచోటే ఉపాధ్యాయునిగా చేరటాన్ని అదృష్టంగా భావిస్తున్నా. నా ఇద్దరు అమ్మాయిలనూ పడమర ఖండ్రికలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాను. ఇద్దరూ ప్రయోజకులయ్యారు.

–డీవీ రాఘవులు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, పడమర ఖండ్రిక

ఆ మాటను నేటికీ పాటిస్తున్నా..



నేను రామవరం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుకున్నప్పుడు సైన్స్ ఉపాధ్యాయుడు కొప్పిశెట్టి లక్ష్మీనారాయణ చెప్పిన మాటలను నేను ఇప్పటికీ తూ.చ తప్పకుండా పాటిస్తున్నాను. జీవితంలో ఎంత బిజీగా ఉన్నా సమయ పాలనకు కట్టుబడి ఉండాలని చెప్పేవారు. ఎంపీడీఓగా ఎంత బిజీగా ఉన్నా సమయాన్ని కచ్చితంగా పాటిస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నప్పుడు ఉపాధ్యాయులు నాకు బోధించిన వ్యక్తిత్వ విలువలకు అధిక ప్రాధాన్యమిస్తాను.

–ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, కపిలేశ్వరపురం

మాక్ జీ-20 ఇంటర్నేషనల్ సమ్మిట్



మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో జీ-20 ఆకృతిలో విద్యార్థులు

రాయవరం: న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న జీ–20 సదస్సుకు సన్నాహక కార్యక్రమంలో భాగంగా మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం మాక్ జీ–20 ఇంటర్నేషనల్ సమ్మిట్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జగన్మోహిని ఆధ్వర్యంలో ఎన్‌జీసీ కోఆర్డినేటర్ కె.రవికుమార్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి ఎంఈఓ పి.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ నాయకత్వ పెంపొందించుకోవాలని సూచించారు. అంతకు ముందుగా విద్యార్థులు 20 దేశాల ప్రతినిధులుగా వ్యవహరించి, వారి దేశాల ఆలోచనలను ప్రతిబింబించారు. అనంతరం జీ–20 ఆకారంలో కూర్చుని సదస్సుకు సంఘీభావం తెలిపారు. ఎన్‌జీసీ కోఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు జి.సుబ్రహ్మణ్యం, జి.రాజు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు



అంగరలో డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ వీర్రాజు

కపిలేశ్వరపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. అంగర డీసీసీబీ బ్రాంచి కార్యాలయాన్ని మరో ప్రైవేట్ భవనంలోకి మార్చగా సోమవారం ఆ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ ప్రధాన కూడలిలోకి కార్యాలయాన్ని మార్చడంతో సహకార సంఘాల పరిధిలోని రైతులకు, సహకార సంఘాల ఉద్యోగులకు డీసీసీబీ కార్యాలయం అందుబాటులో ఉంటుందని వీర్రాజు అన్నారు. ఈ కార్యాలయాన్ని అన్ని హంగులతో విధుల నిర్వహణకు అనుకూలంగా తీర్చిదిద్దారన్నారు. నోడల్ అధికారి సాపిరెడ్డి శ్రీనివాస్, డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు, బ్యాంక్ డైరెక్టర్ రాజిబాబు, నాబార్డ్ ఏజీఎం డీడీ స్వామినాయుడు మాట్లాడుతూ రూ.47 కోట్ల టర్నోవర్‌తో అంగర బ్రాంచి రైతులకు పలు రూపాల్లో సహకారాన్ని అందిస్తుందన్నారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, బ్రాంచ్ మేనేజర్ డి.పట్టాభిరాము, సూపర్‌వైజర్ వినయ్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాచరలో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని వక్తలు అన్నారు. సోమవారం మాచరలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వల్లూరులో పాఠశాలలను స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు పరిశీలించారు. సర్పంచ్ దాసి మీనాకుమారి, సచివాలయ ఉద్యోగులతో కలసి గ్రామంలోని స్వచ్ఛ కార్యక్రమాల అమలును చూశారు. మాచర జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రమాదేవి, స్వచ్ఛ సర్వేక్షణ్ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 15 వరకూ స్వచ్ఛ పక్వాడా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాసరావు, వెంకట్, శివశ్రీను, ప్రసాద్, రామారావు, ఉదయ్, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

గాయాలపాలైన పశువులకు చికిత్స



పశువుకు అందిస్తున్న చికిత్సను పరిశీలిస్తున్న ఏడీ రామకృష్ణ

కె.గంగవరం: మండలంలోని అముజూరులో పిడుగుపాటుకు గురై గాయాలపాలైన పాడి పశువులకు పశువైద్య సిబ్బంది చికిత్సను కొనసాగిస్తున్నారు. సోమవారం పశుసంవర్థక శాఖ ఏడీ రామకృష్ణ గ్రామంలో పర్యటించి పశువుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వెంటనే అవసరమైన చికిత్స అందించాలని పశువులకు ప్రాణపాయ స్థితి నుంచి ఆరోగ్య మెరుగపడేలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుగుపాటుకు మృతి చెందిన పశువులకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా ఉన్నతాధికారులను నివేదించామని తెలిపారు. పామర్రు పశువైద్యాధికారి బిందు, సర్పంచ్ నానాపరపు కల్యాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేట-ద్వారపూడి రహదారిలో రోడ్డు నిర్మాణ పనులు

మండపేట: మండపేట– ద్వారపూడి ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రహదారి నిర్మాణంపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రజలను కోరారు. తిరుపతి పర్యటనకు వెళ్లిన ఆయన ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. రహదారి నిర్మాణం నాణ్యతతో పూర్తి పారదర్శకతతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టామన్నారు. మెటీరియర్ తరలింపు తదితర చిన్నపాటి ఆటంకాలు ఎదురుకావడంతో కొద్దిపాటి జాప్యం జరిగిందన్నారు. దాన్ని ప్రతిపక్షాలు భూతద్దంలో చూపిస్తూ రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఇక నుంచి పనులు నిరంతరాయంగా కొనసాగుతాయని ఎమ్మెల్సీ వివరించారు.

ధరలను నియంత్రించాలి



కాజులూరులో ఆర్ఐ వేగేశ్వరరావుకి వినతిపత్రం సమర్పిస్తున్న ఆందోళనకారులు

కాజులూరు: దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంత్రించాలని సోమవారం కాజులూరులో సీపీఎం కార్యకర్తలు, కౌలురైతు సంఘాల నాయకులు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజుబాబు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలు, రైతులను లక్షాధికారులను చేస్తామని చెప్పి నిత్యావసరాల ధరలను పెంచి వారి బతుకులను భారంగా చేసిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్, పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పడిపోయినప్పటికీ దేశంలో ఇంధన వినియోగంపై ట్యాక్సులు వేస్తూ ఇక్కడ ధరలు పెంచుతూ పోతున్నారన్నారు. అనంతరం ఆర్ఐ వేగేశ్వరరావుకి ఆందోళనకారులు వినతిపత్రం సమర్పించారు. కౌలు రైతు సంఘాల నాయకులు వనుం వీరబ్రహ్మం, నామ మాచరరావు, భూచక్రం పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా చిన్ని రాజు



ఉప సర్పంచ్ రాజును అభినందిస్తున్న సచివాలయ సిబ్బంది

కె.గంగవరం: యండగండిలో జరిగిన ఉపసర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గత పంచాయతీ ఎన్నికల్లో ఇక్కడ ఉప సర్పంచ్ పదవికి జెంటిల్‌మెన్ ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు ఉప సర్పంచ్‌గా పని చేసిన జుత్తుక నాగబాబు రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యం అయింది. అయితే సోమవారం ఉప సర్పంచ్ ఎన్నికను ఎన్నికల అధికారి రామచంద్రపురం ఈఓపీఆర్డీ ఎన్.షెలత్‌రాజ్ పర్యవేక్షణలో నిర్వహించారు. రెండో వార్డు సభ్యుడు అయిన చిన్ని రాజును ఉప సర్పంచ్‌గా పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

రాయవరం: నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం, ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ రాయవరం మండల శాఖ పేర్కొంది. ఈ మేరకు ఎనిమిది డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఐటీయూ మండల నేతలు ఎస్.కృష్ణకుమారి, డి.ఆదిలక్ష్మి తదితరులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ విజయరేఖకు వినతిపత్రం అందజేశారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థిగా ఉండాలి



కళాశాలలో రికార్డులు తనిఖీ చేసి మాట్లాడుతున్న ఆర్‌జేడీ డాక్టర్ కృష్ణ

రామచంద్రపురం: అధ్యాపకులు అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగిస్తూ విద్యార్థులకు నూతన ఒరవడిలో విద్యను అందిస్తూ నిత్య విద్యార్థిగా ఉండాలని రాజమహేంద్రవరం కళాశాల విద్యా సంయుక్త సంచాలకుడు డాక్టర్ సి.కృష్ణ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. కళాశాలలోని విద్యా విషయక, ప్రవేశాలుల, పరిపాలన అంశాలకు సంబంధించిన ఫైల్స్‌ను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యా ప్రగతిని ప్రతిబింబించే విధంగా మొబైల్ యాప్ గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బాలికపై వేధింపులు

ఇద్దరు యువకులపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేటకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ఇద్దరు వేధించిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ వాసు విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బాలిక ద్రాక్షారామలో పదో తరగతి చదువుకుంటోంది. రాత్రి 8 గంటల సమయంలో ట్యూషన్ ముగించుకుని ఇంటికి వెళుతున్న ఆమెను గ్రామానికి చెందిన వినయ్, అభిరామ్‌లు చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించారు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ వాసు వివరించారు.

పనులు పూర్తి చేయండి

కపిలేశ్వరపురం: అద్దంకివారిలంక గ్రామ శివారు కోరుమిల్లిలంక ఎంపీపీ స్కూల్‌లో నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పాఠశాల పీఎంసీ చైర్మన్ బూరుగు సాయికల్యాణి, వైస్ చైర్మన్ కుసుమే ఆదిలక్ష్మి, సచివాలయ కన్వీనర్ సిద్ధాంతుల దొరబాబు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నాడు–నేడు పథకం ఫేజ్ –2లో రూ.5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రూ.3 లక్షల విలువైన పనులు పూర్తయిన తర్వాత వేసవి సెలవుల కారణంగా నిలిపివేశారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎం నాడు– నేడు పనులను పునః ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. దీనిపై విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

నేడు పోలమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రాయవరం: స్థానికంగా పోలమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ వేడుకలు

రామచంద్రపురం రూరల్: సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నేటి మధ్యాహ్నం 2 గంటలకు రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి మానుపూడి శ్రీనివాస్ సోమవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం


రాయవరం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల స్థాయి వేడుకలు నిర్వహించనున్నారు.

బొట్టు బిళ్లలతో సర్వేపల్లి చిత్రం



రాయవరం: ఉపాధ్యాయ లోకానికి దిక్సూచిగా, మార్గదర్శిగా నిలిచిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని పలువురు పలు రకాలుగా తీర్చిదిద్దుతారు. సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చిర్రా వెంకట మోహన్ బొట్టు బిళ్లలతో డాక్టర్ సర్వేపల్లి చిత్రపటాన్ని రూపొందించారు.

డాక్టర్ సర్వేపల్లికి 'చిత్ర' నివాళి



కె.గంగవరం: శివల జెడ్పీ ఉన్నత పాఠశాల పార్ట్‌టైమ్ డ్రాయింగ్ టీచర్ గుబ్బల జ్యోతి జీవకళ ఉట్టిపడేలా రాధాకృష్ణన్ చిత్రపటాన్ని తీర్చిదిద్దడం ద్వారా ఆ మహనీయుడికి నివాళులర్పించింది. వాటర్ కలర్స్‌తో డాక్టర్ రాధాకృష్ణన్ చిత్రం రెండు గంటల్లో జ్యోతి కుంచె నుంచి జాలువారింది.

బోధనలో వినూత్నం



దుర్గాదేవి

కె.గంగవరం: అందరి ఉపాధ్యాయుల్లా బోధించడం కాకుండా బోధనలో వినూత్న పద్ధతులు పాటించి బోధించడం ఉపాధ్యాయిని ఎం.దుర్గాదేవికి మాత్రమే సాధ్యం. దీని కారణంగానే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. మండలంలోని బాలాంత్రం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా దుర్గాదేవి 2017 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఈమె విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధించడం, బోధనోపకరణాలు స్వయంగా తయారు చేసుకోవడం, విద్యార్థులు ఉల్లాసంగా ఉండానికి పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మంచిపేరు తెచ్చుకున్నారు. దుర్గాదేవికి అవార్డు లభించడంపై ఎంఈఓలు నాగరాజు, సీహెచ్ ఆంజనేయులు, సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి తదితరులు అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా 'యాకల'



యాకల రామకృష్ణారావు

రాయవరం: మండలం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా యాకల రామకృష్ణారావు ఎంపికయ్యారు. మాచవరం నంబర్–1 ప్రాథమిక పాఠశాల పీఎస్ హెచ్‌ఎంగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. 1996లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన రామకృష్ణారావు 26 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో సేవలందిస్తున్నారు. ఉత్తమ సేవలు అందించిన వారికి ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని, రామకృష్ణారావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందడం అభినందనీయమని ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు తదితరులు అన్నారు.

శ్రీనివాసరావుకు పురస్కారం



వాసంశెట్టి శ్రీనివాసరావు

కాజులూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా శలపాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసంశెట్టి శ్రీనివాసరావు ఎంపికైనట్టు ఎంఈఓ వివేకానంద తెలిపారు. పాఠశాలలో విద్యాప్రమాణాలు మెరుగుపరచుటలో శ్రీనివాసరావు చేసిన కృషికి గానూ గురుపూజోత్సవం పురస్కరించుకుని జరిగే ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఆయనను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారన్నారు.

ఉపాధ్యాయుల చేతిలో భావితరాల భవిష్యత్తు

మండపేట: ఉపాధ్యాయుల చేతుల్లోనే నేటి తరం విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని జమాత్ ఇస్లామీ హింద్ పట్టణ కమిటీ అధ్యక్షుడు అబుల్ అలా అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులకు తమ సంఘం తరపున ఆయన శుభాకాంక్షలు చెప్పారు. పలువురు ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు.